క్లుప్తంగా

పోలింగ్ సరళిపై చర్చ



ఆనంద్‌కుమార్‌తో 61వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలో బూత్‌ల వారీగా జరిగిన పోలింగ్ సరళిపై నాయకులతో ఆడారి ఆనంద్‌కుమార్ చర్చించారు. పార్టీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వార్డు నాయకులు కలిశారు. వార్డులో ప్రజలు తమ వైపే మొగ్గు చూపారని వివరించారు. కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు పార్టీ అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు),నాయకులు ఎం.అప్పారావు,దాడి సత్యనారాయణ,బూస అప్పలరెడ్డి, ఎస్.వి.రమణ,చట్టి నూకరాజు,గురునాథ్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ జాతరకు ఆలయం ముస్తాబు



ముస్తాబవుతున్న దుర్గాదేవి ఆలయం

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్యదైవం దుర్గానగర్ దుర్గమాంబ జాతరను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. 26న అమ్మవారి జాతర చాటింపు, 27న తొలేళ్ల సంబరం, 28న ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ప్రతిమలకు భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

బౌద్ధాలయంలో అంబేద్కర్ జయంత్యుత్సవం



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బౌద్ధ సమాజం సభ్యులు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి అశోక్‌నగర్ బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం ప్రధాన కార్యదర్శి కె. రాజు గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అంబేద్కర్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేసిన అంబేద్కర్ ఆశయం సాధన ఎంతో గొప్పదని పేర్కొన్నారు. వృద్ధులకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమారావు, ఏఎం ఫ్రెడ్డీ, సీహెచ్ బాబూరావు, సూరి, జి.రాజు, పరిమిళ, సత్య, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

23న వైశాఖ పౌర్ణమి పూజలు



లలితా పీఠంలో లలితాదేవి

సీతంపేట: వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో విశేష పూజలు చేయనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ నెల 23న ఉదయం 7.30 గంటలకు రమాసత్యనారాయణ స్వామికి పంచామృత అభిషేకం, మణిద్వీపంలో శ్రీచరఖ వనావరణ, అలాగే లలితా అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు పీఠంలో రాజశ్యామల హోమం నిర్వహిస్తామని, పాల్గొనదలిచే భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

‘పశ్చిమ’లో చైతన్యం

- గత ఎన్నికలంటే భారీగా పెరిగిన పోలింగ్
- ఓటెత్తిన మహిళా ఓటర్లు

పశ్చిమ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును గతంలో కంటే అధికంగా వినియోగించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే బూత్‌ల వద్ద బారులు తీరారు. భానుడు ప్రతాపం చూపినా ఓటర్లు క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సారి యువతరంతో పాటు మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి కనిపించారు. గత ఎన్నికల కంటే ఏకంగా 11.64 శాతం పోలింగ్ పెరిగింది.

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గం ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. 2019 లో 58.14 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి 69.78 శాతం పోలింగ్ అయింది. సుమారు 11.64 శాతం ఓటింగ్ పెరిగింది. ఇందులో ఎక్కువమంది మహిళా ఓటర్లు పెరగడం విశేషం. మండుటెండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి యువత, మహిళలు, కొత్త ఓటర్లు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలో 2,13,439 మంది ఓటర్లు ఉండగా, 1,48,942 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 71,154 మంది కాగా, మహిళలు 77,781 మంది ఉన్నారు. పురుషుల కంటే 6,627 మంది మహిళా ఓటర్లు అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం.



ఆడారిను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు జోష్‌లో ఉన్నాయి. ప్రజలు ప్రగతి వైపే మొగ్గు చూపారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మంగళవారం పశ్చిమ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సందడి నెలకొంది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌ను కలిసి అభినందనలు తెలపడానికి కార్యకర్తలు నాయకులు భారీగా తరలి వచ్చారు. వార్డుల వారీగా ఆయన్ను కలిశారు.



ఆనంద్ కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న నమ్మి వెంకటకృష్ణ మూర్తియాదవ్ కార్యకర్తలు

సందడే.. సందడి

మర్రిపాలెం వుడాలేఅవుట్ పార్టీ కార్యాలయంలో ఉదయం నుంచి ఆడారి ఆనంద్ కుమార్ కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. వారితో ఓటింగ్ సరళి గురించి చర్చించారు. మీరు పడి కష్టానికి మంచి ఫలితాలు వస్తాయంటూ శ్రేణులను ఉత్సాహపరిచారు. కార్యకర్తలు, నాయకులతో సరదాగా ఫొటోలు దిగారు. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమా కుమారి, ఎన్నికల పరిశీలకులు పీలా ఉమారాణి, పేడాడ రమణి కుమారి, పలు వార్డుల అధ్యక్షులు కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు. సంక్షేమా ఫలాలు అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని ఓటింగ్ సరళిని గమనించిన విశ్లేషకులు చెబుతున్నారు.



గోపాలపట్నం స్కూల్లో బారులు తీరిన ఓటర్లు



సాయంత్రమైనా క్యూ లైన్లో ఓటర్లు

పశ్చిమంలో ఓటింగ్ సరళి ఇలా

మొత్తం పోలింగ్	
బూతుల సంఖ్య	222
మొత్తం ఓటర్లు	2,13,439
మహిళలు	108226
పురుషులు	105202
పోలైన ఓట్లు మొత్తం	148942
మహిళలు	77,781
పురుషులు	71,154
పోలింగ్ శాతం	69.78

బెట్టింగ్ బంగార్రాజులు

- జోరుగా సాగుతున్న పందాలు
- ఓ వైపు ఐపీఎల్..మరోవైపు పొలిటికల్
- రూ.కోట్లకు చేరుకున్న జూదం



పెందుర్తి: ‘ఈ ఓవర్లో వికెట్ పడుతుంది..మీది వెయ్యి మాది ఆరు వందలు’. మ్యాచ్‌లో ఫలానా జట్టు గెలుస్తుంది..మీ పందెం పదివేలు..మాది పదిహేను వేలు’ ఇది ఐపీఎల్ రోజువారీ బెట్టింగ్..మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. మా పార్టీ అభ్యర్థి మెజారిటీ ఇంత’మీ పందెం రూ.లక్ష..మాది రూ.70 వేలు’ ఇది రాజకీయ జూదం.. పెందుర్తి ప్రాంతంలో పందాల జోరు హోరెత్తుతోంది. ఓ వైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగడంతో మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరోవైపు ఇండియన్ పొలిటికల్ లీగ్ తోడవడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగే పండగ. పట్టణం, పల్లెలు తేడా లేకుండా పందాలు జోరందుకున్నాయి. దాబాలు, రెస్టారెంట్‌లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు వేదికగా క్రికెట్‌తో పాటు పొలిటికల్ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సగటున రూ.లక్షలు పందం కాస్తుండగా మొత్తంగా కలిపి రూ.కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నాకౌట్ పోటీలతో పాటు ఎన్నికల ఫలితాలకు రోజులు దగ్గర పడుతున్న కొద్దీ ఈ బెట్టింగ్ విశ్వరూపం దాల్చే పరిస్థితి కనబడుతోంది. ఈ బెట్టింగ్‌లకు నగదుతో పాటు ఆస్తులు, వాహనాలు, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు కూడా పెడుతున్నట్లు తెలుస్తుంది.

మీది ఇంత.. మాది ఇంత

ఐపీఎల్ విషయానికి వస్తే ఓవర్‌కు పరుగులు, వికెట్లు పడే సమయాలు, నోబాల్‌లు, వైడ్లు ఎప్పుడు పడతాయి.. ఫోర్లు, సిక్సర్లు ఎప్పుడు కొడతారు. వీటికి రూ.వేలల్లో పందాలు వేసుకుంటున్నారు. ఆఖరిగా మ్యాచ్‌ల ఫలితాలపై భారీగానే పందాలు సాగుతున్నాయి. జట్ల బలబలాల బట్టి పందెంరాయుళ్లు బరిలోకి దిగుతున్నారు. ఒక జట్టు బలహీనంగా ఉంటే దానిపై తక్కువ మొత్తం పందెం వేస్తున్నారు. బలమైన జట్టు వైపు ఉన్నవారు దానికి కాస్త ఎక్కువ మొత్తం పందెం కాస్తున్నారు. ఉదాహరణకు బలమైన జట్టుపై రూ. పది వేలు పెడితే..బలహీనమైన జట్టుపై రూ.5 వేలను నుంచి 7 వేల వరకు. ఈ పందాల కోసం ప్రత్యేకంగా పేకాట మాదిరిగా డెన్లు ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

కోసు పందాలు : రాజకీయ బెట్టింగ్ విషయానికి వస్తే వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని..అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందాలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ.లక్షల్లో పందాలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘననీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పొలిటికల్ బెట్టింగ్ విషయంలో పందెం రాయుళ్లు సర్వేలను కూడా ఆధారం చేసుకుంటున్నారు. మొత్తానికి రానున్న మూడు వారాల పాటు బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగనుంది. అయితే ఈ మాయా జూదానికి పోలీసులు అడ్డుకట్ట వేయాల్సి ఉందని పలువురు భావిస్తున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చిస్వామికి అభిషేకాలు చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన




అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇది మాదారి

- రోడ్లపై ఇష్టానుసారంగా పశువుల సంచారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు




మహాలక్ష్మి థియేటర్ మార్గంలో..

మల్కాపురం: నలుగురు నడిచే దారిలో.. వాహనాలు తిరగాల్సిన మార్గాల్లో పశువులు సంచరిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం ఇదే సమస్య ఎదురవుతున్నా అధికారులు కనీసం స్పందించక పోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీహరిపురం,మల్కాపురం,ఐవోసీ మార్గాల్లో పశువులు సంచరిస్తున్నాయి.ఇక్కడ క్రాంతినగర్, మల్కాపురం ప్రాంతాల్లోని పశువుల పెంపకం దార్లు పాలు పితికిన తర్వాత వాటిని రోడ్లపై మేత కోసం నిర్లక్ష్యంగా విడిచిపెడుతున్నారు. ఇవి ఆహారం కోసం రోడ్లపైకి వచ్చి సేవా మార్గాల్లో మల,మూత్ర విసర్జన చేస్తు అపరిశుభ్రం చేస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా వారు పట్టించుకోవడం లేదని స్థానిక వాసులు ఆరోపిస్తున్నారు.



మల్కాపురం పోలీస్‌స్టేషన్ వద్ద సర్వీసు రోడ్డులో సంచరిస్తున్న పశువులు



ఐవోసీ మార్గంలో వాహనాలకు అడ్డంగా నిలబడిన గేదెలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వాహనచోదకుడికి గాయాలు

మల్కాపురం: రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ మహిళను ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై, ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు కృష్ణవేణి (45)కి వివాహం కాకపోవడంతో, తన తమ్ముడి కుటుంబంతో కలిసి అల్లిపురం ప్రాంతంలో ఉంటున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటు వేసి ఇంటికి వెళ్లిన ఆమె, సాయంత్రం సమయంలో ఇంటి నుంచి వచ్చి నేవల్ డాక్‌యార్డ్ వద్ద గల సర్దార్ వంతెన వద్ద రాత్రి 7గంటలకు నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహన దారుడు ఢీకనడంతో కృష్ణవేణికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించిందని పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె వివరాల కోసం విచారించి, వారి బంధువులకు కృష్ణవేణి మృతి గురించి వివరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు.



మృతురాలు కృష్ణవేణి

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం , జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.



పాల్గొన్న ఉభయదాతలు

భక్తి శ్రద్ధలతో హోమం



స్వామి వారి ఆలయ ప్రాంగణంలో హోమంలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ముందుగా 108 కలశాలతో స్వామి వారికి అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేక హోమాలు చేశారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రమణానంద స్వామిజీ చేతుల మీదుగా ఈ పూజలు జరిగాయి. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, విల్లూరి శ్రీనివాసరావు, అప్పలరెడ్డి, పెంటకోట వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని కోచ్ ఇండికేటర్లు

ప్రయాణికుల అవస్థలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై తరచూ కోచ్ ఇండికేటర్లు పనిచేయక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు ఎక్కాల్సిన కోచ్ ఎక్కడికి వచ్చి ఆగుతుందో తెలియక లగేజీలు, వృద్ధులు, పిల్లలతో పరుగులు తీయాల్సి వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పునరావృతం కాకుండా చూడాలని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను కోరారు.



దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై పనిచేయని కోచ్ ఇండికేటర్లు

ఘనంగా కనకమ్మ నవరాత్రి మహోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు బేరి గురుమూర్తిరెడ్డి తదితరులు

సీతమ్మధార : రేసవానిపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీకనకమ్మ నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పసుపు కుంకుమలు, ఫల పుష్పాలు ఇత్యాది కానుకులు సమర్పించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సేవ గరిడీ, పులివేషాలు, నేల వేషాలతో అమ్మవారి అనుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేసవానిపాలెం గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బేరి గురుమూర్తిరెడ్డి, సెక్రటరీ జీరు అప్పలస్వామిరెడ్డి, కోశాధికారి గాలి శివకుమార్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కాళీమాత వేషధారణలో కళాకారులు

చెత్తకు నిప్పు.. ఎగసిన మంటలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు ప్రధాన గెడ్డ వద్ద మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ గ్రామాన్ని ఆవరించడంతో ఏం జరిగిందోనని జనం ఆందోళన చెందారు. సంఘటన స్థలం వద్దకు పరుగులు తీశారు. అయితే గెడ్డ పక్కన ఉన్న చెత్తకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వచ్చాయని తెలుసుకుని, వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందజేశారు. స్పందించిన వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.



మంటలు చెలరేగుతున్న దృశ్యం

ప్రజా మద్దతుతో ప్లాంటును రక్షించుకుంటాం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1188వ రోజుకు రిలే దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రైవేటు సంస్థకు అప్పగించడానికి తలో చేయి వేసి సహకారం అందిస్తున్నారని, అదే నేడు ఈ దుస్థితికి కారణమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతుతో ప్లాంటును పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1188వ రోజు శిబిరంలో వారు మాట్లాడారు. గంగవరం పోర్టు యాజమాన్యం సృష్టిస్తున్న అవరోధాలు, అడ్డంకులు ప్రజల సహకారంతో ఎప్పటికైనా తొలగిపోతాయన్నారు. కుట్రలెన్ని చేసినా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించలేరన్నారు. ప్రజలు తలచుకుంటే పాలకులే కాదు, ఏ పారిశ్రామికవేత్తలు, తొత్తులు నిలబడలేరన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.రామ్మోహనకుమార్, డి.శ్రీనివాస్, జి.నరేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు

ఘనంగా చిన్మయానంద జయంతి



చిన్మయానంద పాదుకా పూజ చేస్తున్న భక్తులు

ఉక్కునగరం: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిన్మయానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్మయానంద 108వ జయంతి సందర్భంగా చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ‘చిన్మయ శంకరం’ పేరిట ఈ వేడుకలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8.30 వరకు కూర్మన్నపాలెం అన్నపూర్ణ థియేటర్ సమీప శ్రీకృష్ణ ఈడెన్ ఫంక్షన్ హాల్లో పాదుకా పూజ నిర్వహించారు. మహిళలచే భజనలు, కోలాటం జరిగాయి. బాలలు భరతనాట్య ప్రదర్శనతో తమ ప్రావీణ్యత చాటారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.